# కండ్లెదుటే కన్నతండ్రిపై దాడి.. బాలిక హఠాన్మరణం

**సూర్యాపేట జిల్లా నాగారం కొత్తపల్లిలో విషాదం**



పావని(ఫైల్)

తిరుమలగిరి (నాగారం), ఆగస్టు 16: తండ్రిపై ముగ్గురు ప్రత్యర్థుల దాడితో ఆ పసి హృదయం తల్లడిల్లింది. 'నాన్నా నాన్నా' అంటూ భోరున విలపించింది. అల్లారుముద్దుగా పెంచిన తండ్రిపై జరుగుతున్న దాడితో గుండెలవిసేలా ఏడ్చింది. తండ్రిని వదలకుండా కొడుతుంటే ఏడ్చీ ఏడ్చీ కుప్పకూలింది. కన్నతండ్రిపై జరుగుతున్న దురాగతాన్ని తట్టుకోలేని ఆ పసిహృదయం అక్కడే తనువు చాలించింది. సూర్యాపేట జిల్లా నాగారం మండలం డీకొత్తపల్లిలో జరిగిన ఈ ఘటనతో దౌర్జన్యాలకు పాల్పడే దుండుగులకు కనువిప్పు కలగాలని సభ్య సమాజం కోరుకుంటున్నది. కొత్తపల్లికి చెందిన బైక్ మెకానిక్ కాసం సోమయ్యకు అదే గ్రామానికి చెందిన కడారి సైదులు, కడారి సోమయ్య, కాసం కళింగంతో భూతగాదాలున్నాయి. గ్రామంలో గురువారం బోనాల పండుగ జరిగింది. రాత్రి 10 గంటల సమయంలో సోమయ్య ఇంటి ముందుకొచ్చిన కడారి సైదులు, కడారి సోమయ్య, కాసం కళింగం కర్రలు, ఇనుప రాడ్లతో విచక్షణారహితంగా దాడిచేయగా సోమయ్య కాలు విరిగడంతోపాటు తల పగిలింది. అడ్డుకోబోయిన భార్య తలకూ గాయాలయ్యాయి. దాడి జరుగుతుంటే అక్కడే ఉన్న ఆయన కూతురు పావని (14) భయాందోళనకు గురైంది. 'నాన్నా నాన్నా' అంటూ అరవసాగింది. అయినా ఆ కఠినాత్ములు వదలడంలేదు. తన తండ్రిని చంపుతున్నారని భావించి తట్టుకోలేని బాలిక స్పృహతప్పి కుప్పకూలింది. కుటుంబసభ్యులు వెళ్లిచూడగా అప్పటికే తనువు చాలించింది. సోమయ్య దంపతులకు ఇద్దరు కూతుళ్లు కాగా, పావని చిన్నది. సూర్యాపేటలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్నది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు నాగారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని సూర్యాపేట డీఎస్పీ రవి, సీఐ రఘువీర్‌రెడ్డి, ఎస్‌ఐ ఐలయ్య పరిశీలించారు. నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

# అన్నావదినను చెట్టుకు కట్టేసి..!

**20 వేల వడ్డీ కోసం.. సిద్దిపేటలో అమానుషం**

సిద్దిపేట టౌన్, ఆగస్టు 16 : డబ్బుల కోసం మనుషులు ఎంతకైనా తెగిస్తున్నారు. కేవలం రూ.20 వేల వడ్డీ డబ్బుల కోసం ఓ వ్యక్తి తన సొంత అన్నావదినను చెట్టుకు కట్టేసి దాడి చేశాడు. ఈ ఘటన సిద్దిపేట పట్టణంలోని నాసర్‌పురాలో శుక్రవారం కన్నీరు పెట్టించింది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట పట్టణానికి చెందిన దొంతర బోయిన పరశురాములు తన అవసరాల నిమిత్తం సొంత తమ్ముడు కనకయ్య వద్ద లక్ష రూపాయల అప్పుగా తీసుకున్నాడు. నాలుగు నెలల క్రితం సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించాడు. మిగిలిన రూ.20 వేల వడ్డీ కోసం తమ్ముడు కనకయ్య అన్న పరశురాములను వేధించాడు. ఈ క్రమంలో కౌన్సిలర్ జంగిటి కనకరాజు వద్దకు వీరి పంచాయితీ వెళ్లింది. ఆయన వీరిద్దరిని పిలిచి మాట్లాడుతుండగానే ఇద్దరు గొడవకు దిగారు. వారిని కౌన్సిలర్ అక్కడి నుంచి పంపించేశారు. అన్న పరశురాములు వెళ్లి పోతుంటే.. 'నాకు ఇవ్వాల్సి వడ్డీ డబ్బులు ఇవ్వకుండా ఎలా పోతావో? చూస్తా' అంటూ.. అన్నను లాక్కొచ్చి హనుమాన్ దేవాలయ ప్రాంగణంలోని చెట్టుకు కట్టేశాడు. అతంటితో ఆగకుండా అడ్డువచ్చిన వదినను సైతం కట్టేశాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని దవాఖానకు తరలించారు. బాధితుల ఫిర్యాదుతో కనకయ్యపై కేసు నమోదు చేశారు.



అన్నావదినను ఆలయ ప్రాంగణంలోని చెట్టుకు కట్టివేసిన దృశ్యం

## వానకాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 38.9°c | 23.4°c |
| మెదక్ | 38.0°c | 22.6°c |
| రంగారెడ్డి | 37.3°c | 22.6°c |
| హైదరాబాద్ | 33.4°c | 21.2°c |
| నల్లగొండ | 33.0°c | 24.4°c |
| నిజామాబాద్ | 32.8°c | 25.4°c |
| మహబూబ్‌నగర్ | 32.5°c | 23.1°c |
| ఖమ్మం | 32.0°c | 25.0°c |
| కరీంనగర్ | 28.0°c | 25.0°c |
| వరంగల్ | 28.0°c | 26.0°c |

# రాష్ట్రంలో 22 వరకు వర్షాలు!

- హైదరాబాద్, రంగారెడ్డిలో నేడు, రేపు వానలు
- పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ
- ఇప్పటి వరకు 13 శాతం అధిక వర్షపాతం

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): ఆవర్తన ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో ఈ నెల 22 వరకు మోస్తరు వర్షాలు కురువనున్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. హైదరాబాద్, రంగారెడ్డి, నాగర్‌కర్నూలు జిల్లాల్లో శని, ఆదివారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని అంచనా వేసింది. శనివారం వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ-గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు తెలిపింది. ఆదివారం ఆదిలాబాద్, కుమ్రంభీం-ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న-సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్-భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి-కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని పేర్కొంది. సోమవారం ఆదిలాబాద్, కుమ్రంభీం-ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న-సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్-భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి-కొత్తగూడెం, వరంగల్, హన్మకొండ, జనగామ, సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉండగా ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.

**పెరిగిన ఉక్కపోత**

వారం రోజులుగా తెలంగాణతోపాటు ఏపీలోనూ ఎండలు, ఉక్కపోత పెరిగాయి. సాధారణంకన్నా ఎక్కువగా ఉష్ణోగ్రతలు (36 డిగ్రీలకు పైగానే) నమోదవుతున్నాయి. మరి కొద్ది రోజులు ఇలాగే ఉంటుందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. నైరుతి రుతుపవనాల ప్రభావం బలహీనపడుతుండటంతో ఎండలు పెరుగుతున్నట్టు అంచనా వేసింది. రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల రాక నుంచి ఇప్పటి వరకు 13 శాతం అధిక వర్షపాతం నమోదైనట్టు వాతావరణ కేంద్రం తెలిపింది. హైదరాబాద్‌లో సాధారణ వర్షపాతం కంటే 2 శాతం అధిక వర్షపాతం నమోదైందని వెల్లడించింది. మరోవైపు గడిచిన 24 గంటల్లో సంగారెడ్డి, నాగర్‌కర్నూల్, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. సంగారెడ్డి జిల్లా చౌటకూర్‌లో అత్యధికంగా 10.59 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

# రాష్ట్రంలో దంచికొట్టిన వాన

**లోతట్టు ప్రాంతాలు జలమయం**



జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం కోనాపూర్‌లో తాడు సహాయంతో వాగుదాటుతున్న గ్రామస్థులు

న్యూస్‌నెట్‌వర్క్, ఆగస్టు 16: రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. శుక్రవారం ఉమ్మడి కరీంనగర్, మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో వర్షం దంచికొట్టింది. కరీంనగర్ జిల్లా గంగాధర మండల కేంద్రం సమీపంలోని మధురానగర్ వద్ద కరీంనగర్-జగిత్యాల రహదారిపై చెట్టు విరిగిపడటంతో కొద్దిసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం కోనాపూర్ వెళ్లే దారిలో వాగు ఉప్పొంగి ప్రవహించడంతో దాటలేని పరిస్థితి నెలకొన్నది. మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. పాత బస్టాండ్, రాందాస్ చౌరస్తా రోడ్లలో సుమారు అరగంటకు పైగా వాహనాలు నిలిచిపోయాయి. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరికి చెందిన దరి రమేశ్ (30) అనే కూలీ పిడుగు పడటంతో మృతి చెందాడు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో శుక్రవారం సాయంత్రం వర్షం దంచికొట్టింది. గంటసేపు కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతంలోని పలు ఇండ్లు, దుకాణాల్లోకి వరద చేరింది. పట్టణంలోని పైభాగం నుంచి వచ్చిన వరద నాగర్‌కర్నూల్-జడ్చర్ల ప్రధాన రహదారిని ముంచెత్తింది. దీంతో వాహనాల రాకపోకలు నిలిచి ట్రాఫిక్ స్తంభించిపోయింది.

# అమెరికాలో ఓరుగల్లు యువకుడి మృతి



రాజేశ్ (ఫైల్)

ఆత్మకూరు, ఆగస్టు 16: అమెరికాలో ఓరుగల్లు యువకుడు మూడు రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. ఉన్నత చదువుల కోసం యూఎస్ వెళ్లిన ఆయన చనిపోయినట్టు శుక్రవారం కుటుంబ సభ్యులు తెలిపారు. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన ఏరుకొండ రాజేశ్ (33) 2015లో ఎమ్మెస్ చేసేందుకు అమెరికా వెళ్లాడు. తొమ్మిది సంవత్సరాలుగా అక్కడే ఉంటున్నాడు. మూడు రోజుల క్రితం బీపీ, షుగర్ పెరగడంతోపాటు ఒక్కసారిగా గుండెపోటు వచ్చి మృతి చెందాడు. ఈ విషయాన్ని స్నేహితులు ఫోన్ చేసి కుటుంబ సభ్యులకు తెలిపారు. దిక్కు తోచని స్థితిలో వారు ఇంటి వద్ద రోదిస్తున్నారు. రాజేశ్ తండ్రి సాంబయ్య 11 నెలల క్రితమే మృతి చెందాడు. తల్లికి ఏం చేయాలో తెలియక కన్నీరు మున్నీరవుతున్నది. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని రాజేశ్ తల్లి, కుటుంబ సభ్యులు కోరుతున్నారు.



జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

# లోవోల్టేజీ సమస్యపై రైతుల నిరసన

**వర్షకొండ సబ్ స్టేషన్ ఎదుట బైఠాయింపు**

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 16 : లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండకు చెందిన సుమారు 200 మంది రైతులు ఆందోళనకు దిగారు. శుక్రవారం వర్షకొండ సబ్‌స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం ట్రాన్స్‌కో ఏఈ సతీశ్‌కు వినతిపత్రాన్ని అందించి, లోవోల్టేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ. నాలుగు రోజులుగా వ్యవసాయానికి తరచూ విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో 150 మోటర్లు కాలిపోయినట్టు తెలిపారు. విద్యుత్తు అధికారులు నష్టపరిహారం చెల్లించడంతోపాటు లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



ఆదిలాబాద్ జిల్లా తాంసిలోని సబ్ స్టేషన్‌ను ముట్టడించిన రైతులు

# ఈ విద్యుత్తు అధికారులు మాకొద్దు

- కోతలపై విన్నవిస్తే కేసులు పెడుతామని బెదిరిస్తుండ్రు
- సబ్ స్టేషన్‌ను ముట్టడించిన రైతులు

తాంసి, ఆగస్టు 16 : కరెంట్ కోతలపై ప్రశ్నిస్తే కేసులు పెడుతామని బెదిరిస్తున్న అధికారుల తీరును నిరసిస్తూ రైతులు ఆదిలాబాద్ జిల్లా తాంసి సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. 'మండల విద్యుత్తు అధికారితోపాటు సీనియర్ లైన్‌మెన్.. మాకొద్దు' అంటూ నినదించారు. నెల రోజులుగా తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయంతో ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. గురువారం రాత్రి విద్యుత్తు సరఫరాలో అంతరాయంపై జామిడి గ్రామస్థులు విన్నవించగా మద్యం తాగి వచ్చి గొడవ చేస్తున్నారని కేసు పెడుతామని సబ్ స్టేషన్ అధికారులు బెదిరించారని వారు వాపోయారు. శుక్రవారం కూడా కరెంట్ లేకపోవడంతో అధికారుల తీరుకు నిరసనగా సబ్ స్టేషన్‌ను ముట్టడించారు.



మహబూబాబాద్ జిల్లా కేసముద్రం సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

# కరెంట్ సరఫరాపై రైతులు సంతోషంగా లేరు

- ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా పనిచేయాలి
- అధికారులతో సమీక్షలో ఎమ్మెల్యే మురళీనాయక్

కేసముద్రం, ఆగస్టు 16: విద్యుత్తు సరఫరా విషయంలో రైతులు సంతోషంగా లేరని, తరచూ అంతరాయం ఏర్పడుతుందని ఫిర్యాదులు చేస్తున్నారని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలోని రైతు వేదికలో శుక్రవారం అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు ఇస్తున్నామనే విషయాన్ని అధికారులు గుర్తించుకొని చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చేలా చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. రుణ మాఫీ విషయంలోనూ రైతులకు స్పష్టత లేదని, సమస్యలు రాకుండా అధికారులు చూసుకోవాలని చెప్పారు. గ్రామాల్లోని పైప్ లైన్ల లీకేజీ సమస్యలను పరిష్కరించి ప్రజలకు భగీరథ నీటిని అందించాలని ఆదేశించారు. కెనాల్ నీరు ప్రతి చెరువులోకి వచ్చేలా చూడాలన్నారు. వన మహోత్సవం పూర్తి స్థాయిలో జరగడం లేదని, నాటిన ప్రతి మొక్క బతికే విధంగా చూడాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.

# విద్యుత్తు శాఖ ఇంజినీర్ల సస్పెన్షన్

నమస్తే ఎఫెక్ట్

కాశీబుగ్గ, ఆగస్టు 16: విధి నిర్వహణలో అసభ్యకరంగా వ్యవహరించిన ఇద్దరు ఎన్పీడీసీఎల్ ఇంజినీర్లను సస్పెండ్ చేసినట్టు ఆ సంస్థ సీఈ (హెచ్చార్డీ అండ్ ట్రైనింగ్) టీ మధుసూదన్ ప్రకటించారు. శుక్రవారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన 'కరెంట్ కోతలు.. అడిగితే బూతులు' కథనానికి విద్యుత్తు శాఖ అధికారులు స్పందించారు. సంబంధిత అధికారుల తీరుపై విచారణ చేపట్టి సస్పెండ్ చేసినట్టు ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ సర్కిల్ పరిధిలో ఏఈగా పనిచేస్తున్న ఎం జ్యోతిర్మయినాథ్‌తోపాటు గొర్రెకుంట సబ్ ఇంజినీర్ డీ నరేశ్‌ను సస్పెండ్ చేస్తూ ఎస్ఈ పీ మధుసూదన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు.

# విద్యుత్తు షాక్‌తో రైతుమృతి



పోచయ్య (ఫైల్)

నాగిరెడ్డిపేట, ఆగస్టు 16: ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్తు తీగలను సరిచేస్తుండగా ఓ రైతు షాక్‌గురై మృతి చెందాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం జలాల్‌పూర్‌లో శుక్రవారం చోటుచేసుకున్నది. ఎస్సై మల్లారెడ్డి, స్థానికుల కథనం ప్రకారం.. జలాల్‌పూర్ గ్రామానికి చెందిన చితుకుల (కుర్మ) పోచయ్య (38) గ్రామ శివారులోని తనకున్న ఐదెకరాల భూమిలో ఇటీవల వరి వేశాడు. శుక్రవారం ఉదయం వరుసకు అల్లుడైన రమేశ్‌తో కలిసి పంటకు నీరు పారించేందుకు వెళ్లాడు. బోరు మోటర్లు పని చేయకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తెగిపోయిన తీగలను గుర్తించాడు. వాటిని సరి చేస్తుండగా అకస్మాత్తుగా విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. అక్కడే ఉన్న రమేశ్ కేకలు వేయడంతో పక్కనే పొలం వద్ద ఉన్న రైతులు వచ్చి ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్తు సరఫరా నిలిపివేసి చూడగా అప్పటికే పోచయ్య మృతిచెందినట్టు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

# అమెరికా చదువుల్లో స్టెమ్ కోర్సులే టాప్

- సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్‌పై ఆసక్తి
- 40% మంది వీటిలోనే చేరిక
- అక్కడి వారిలో 2.7లక్షల మంది ఇండియన్సే



యూఎస్ కాన్సులేట్ ఎడ్యుకేషన్ యూనివర్సిటీ ఫెయిర్‌లో పాల్గొన్న విద్యార్థులు

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): అమెరికాలోని అత్యధిక భారతీయ విద్యార్థులు ఎంపిక చేసుకుంటున్నవి సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్ అండ్ మ్యాథమెటిక్స్(స్టెమ్)కోర్సులే. 2.40లక్షల (22.7శాతం) మంది విద్యార్థులు కంప్యూటర్ సైన్స్, గణితం కోర్సుల్లో చేరగా, 2.02లక్షల (19.2శాతం) విద్యార్థులు ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలు పొందారు. అత్యధికులు స్టెమ్ కోర్సుల్లోనే చేరుతున్నట్టు వర్సిటీల ప్రతినిధులు వెల్లడించారు. కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సుల్లో భారతీయ విద్యార్థులు అధికంగా చేరుతున్నట్టు అరిజోనా స్టేట్ వర్సిటీ ప్రతినిధి తోట సాయికృష్ణ తెలిపారు. డాటా అనలెటిక్స్, డాటా సైన్స్, అకౌంటింగ్ కోర్సులు, కంప్యూటర్ సైన్స్ ప్రోగ్రాంకు డిమాండ్ ఉంటోందని నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ ప్రతినిధి సల్మాన్ తెలిపారు. అమెరికా చదువులపై అవగాహన కల్పించేందుకు యూఎస్ఏ కాన్సులేట్ ఎడ్యుకేషన్ యూనివర్సిటీ ఫెయిర్ శుక్రవారం మాదాపూర్‌లో నిర్వహించగా యూఎస్ కాన్సులేట్ పబ్లిక్ ఆఫైర్స్ ఆఫీసర్ అలెగ్జాండర్ మెక్‌లీన్ ప్రారంభించారు. 80 వర్సిటీల ప్రతినిధులు కోర్సులు, ఫీజులు, స్కాలర్‌షిప్ సమాచారాన్ని అందించారు.

**అమెరికాపైనే ఆశలు..**

లే ఆఫ్‌ల భయం.. ఆర్థిక మాంద్యం.. పైగా అనేక ఆంక్షలు. ఉద్యోగాల లేమి పీడిస్తున్నా మన విద్యార్థులు యూఎస్‌పైనే ఆశలు పెట్టుకుంటున్నారు. విదేశీ చదువుల కోసం అత్యధికులు అమెరికానే ఎంచుకుంటున్నారు. ఏటేటా అమెరికా వీసాలు పొందుతున్న ప్రతి నలుగురు విద్యార్థుల్లో ఒక్కరు భారతీయ విద్యార్థే ఉండటం విశేషం. 69శాతం విద్యార్థులు తమ అంతర్జాతీయ చదువులకు అమెరికానే గమ్యస్థానంగా భావిస్తున్నారు. గ్రాడ్యుయేట్ విద్యార్థులు 62 శాతముండగా, 16 మంది అండర్ గ్రాడ్యుయేట్, 1.3శాతం ఓపీటీ విద్యార్థులున్నారు. 2023లో 1.40లక్షల వీసాలను భారతీయ విద్యార్థులే పొందారు. మరే దేశ విద్యార్థులు ఈ స్థాయిలో వీసాలను పొందలేదు. అమెరికాలో ప్రస్తుతం 2.7లక్షల మంది భారతీయ విద్యార్థులున్నారు. వీరిలో 1.35లక్షల మంది తెలుగు రాష్ట్రాలకు చెందినవారే. న్యూయార్క్ వర్సిటీలో24వేల మంది చేరగా, ఆ తర్వాత నార్త్ ఈస్టన్ యూనివర్సిటీలో 20 వేలు, కొలంబియాలో 19వేలు, అరిజోనా వర్సిటీలో 17వేల మందితో టాప్ -4 స్థానాల్లో ఉన్నాయి. ఏటేటా అమెరికా వీసాలు పొందుతున్న విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది. 2017లో కేవలం 51వేల వీసాలను జారీచేయగా, 2023కు వచ్చేసరికి 1.4లక్షలకు చేరింది. అంటే ఈ ఏడు సంవత్సరాల్లో 90వేల వీసాలు అత్యధికంగా జారీ అయ్యాయి.

**ఏటా వీసాల జారీతీరు**

| సంవత్సరం | వీసాలు |
|---|---|
| 2017 | 51వేలు |
| 2018 | 55వేలు |
| 2019 | 55వేలు |
| 2020 | కరోనా |
| 2021 | 96వేలు |
| 2022 | 1.33లక్షలు |
| 2023 | 1.40లక్షలు |

## మెడికల్ అడ్మిషన్లు, సౌకర్యాల పర్యవేక్షణకు టాస్క్‌ఫోర్స్

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వైద్యవిద్య ప్రవేశాలు, దవాఖానల్లో వసతుల కల్పనను పర్యవేక్షించేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తూ ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్‌చోంగ్తు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. టాస్క్‌ఫోర్స్‌లో డీఎంఈ సభ్యకార్యదర్శిగా , డీఎంఈ(అకడమిక్), హెల్త్ వర్సిటీ రిజిస్ట్రార్, ఉస్మానియా, గాంధీ మెడికల్ కాలేజీల ప్రిన్సిపాళ్లు సభ్యులుగా ఉంటారు. ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్, పీజీ సీట్ల అడ్మిషన్ల ప్రక్రియను టాస్క్‌ఫోర్స్ పర్యవేక్షించనున్నది. బయోమెట్రిక్ అటెండెన్స్, ఓపీ, ఐపీ, మాతాశిశు సంరక్షణ సేవలు, పోస్టుమార్టం విభాగాల్లో వసతులపై నిశితంగా పరిశీలించి, ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నది.

## రిటైర్డ్ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల కొనసాగింపు

నమస్తే ఎఫెక్ట్

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): వర్సిటీల్లో 60 ఏండ్లు పూర్తిచేసుకున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను తిరిగి కొనసాగించాలని ఉన్నత విద్యామండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాంవెంకటేశ్ అన్ని వర్సిటీల రిజిస్ట్రార్లకు లేఖ రాశారు. 12 వర్సిటీల్లో 900 మంది కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు పనిచేస్తున్నారు. ఇటీవల 60 ఏండ్లు పూర్తిచేసుకున్న 15 మంది పదవీ విరమణ పొందారు. ఇదే విషయాన్ని ఇటీవల 'నమస్తే తెలంగాణ' వెలుగులోకి తీసుకొచ్చింది. 'క్రమబద్ధీకరణ కలేనా' అన్న శీర్షికతో కథనాన్ని ప్రచురించింది. రెగ్యులర్ ఫ్యాకల్టీ లేక, కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు పదవీ విరమణ పొందుతుండటంతో వర్సిటీల్లో బోధన గాడి తప్పుతోందని సర్కారు దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన విద్యాశాఖ 60 ఏండ్లు పూర్తిచేసుకున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను కొనసాగించాలని ఉత్తర్వులిచ్చింది.

## అక్టోబర్‌లో ఓపెన్ పరీక్షలు

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఓపెన్ స్కూల్ పబ్లిక్ పరీక్షలను అక్టోబర్ మొదటివారంలో నిర్వహిస్తామని డైరెక్టర్ పీవీ శ్రీహరి తెలిపారు. పరీక్షలకు హాజరయ్యేవారు 30 లోగా ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. ఆలస్య రుసుముతో సెప్టెంబర్ 9లోగా ఫీజును చెల్లించవచ్చని తెలిపారు.

## నేడు బడుల్లో.. నో బ్యాగ్ డే

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ) : భార రహిత, ఒత్తిడిలేని చదువులనందించేందుకు అమలుచేస్తున్న 'నో బ్యాగ్‌డే'ను రాష్ట్రంలోని అన్ని బడుల్లో శనివారం జరపనున్నారు. ప్రతి నెల మూడో శనివారం 'నో బ్యాగ్‌డే' అమలుచేయాలని గతంలోనే పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులిచ్చింది. ఈ మేరకు ఎస్సీఈఆర్టీ కరదీపికలను ముద్రించింది.



ఆర్డీవోలు, తహసీల్దార్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భీమ్యానాయక్

# దరఖాస్తులను ఎలా రిజెక్ట్ చేస్తారు?

- క్షేత్రస్థాయిలో పరిశీలించరా?
- తహసీల్దార్లపై సిరిసిల్ల అదనపు కలెక్టర్ ఆగ్రహం

నమస్తే ఎఫెక్ట్

కరీంనగర్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే రెవెన్యూ దరఖాస్తులను ఎలా రిజెక్ట్ చేస్తారని సిరిసిల్ల అదనపు కలెక్టర్.. అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. 'రెవెన్యూ దరఖాస్తులు లక్షకుపైగా రిజెక్ట్?' శీర్షికన 15న 'నమస్తే తెలంగాణ' మెయిన్‌లో ప్రచురితమైన కథనం సంచలనం సృష్టించింది. పైనుంచి ఒత్తిళ్లు, జరిగిన తప్పులు, తద్వారా రైతులకు జరిగిన అన్యాయం, దరఖాస్తుల తిరస్కరణ వంటి అంశాలను కండ్లముందుంచడం కలకలం రేపింది. దీంతో రాష్ట్ర సర్కారు దరఖాస్తులపై స్పందించింది. రాజన్న సిరిసిల్ల జిల్లా ఉన్నతాధికారులను వివరాలు అడిగినట్టుగా తెలుస్తుండగా.. శుక్రవారం సిరిసిల్ల అదనపు కలెక్టర్ భీమ్యానాయక్ తన చాంబర్‌లో ఆర్డీవోలు, తహసీల్దార్లతో హడావిడిగా సమావేశం నిర్వహించారు. సమావేశంలో పలువురు తహసీల్దార్ల తీరుపై ఆగ్రహించినట్టు తెలిసింది. క్షేత్రస్థాయిలో ఏ మాత్రం పరిశీలన చేయకుండా దరఖాస్తులు ఎలా రిజెక్ట్ చేస్తారని ప్రశ్నించినట్టు సమాచారం. ప్రతి మండలంలో ఎన్ని దరఖాస్తులను తిరస్కరించారన్న వివరాలు తెలుసుకోవడంతోపాటు అందుకు కారణాలను అడిగినట్టు తెలిసింది. మెజార్టీ తహసీల్దార్లు సరైన సమాధానం చెప్పకపోవడంతో ఆగ్రహం వ్యక్తంచేసినట్టు రెవెన్యూ అధికార వర్గాల ద్వారా సమాచారం. త్వరితగతిన పనులు చేయించడంలో భాగంగా పైఅధికారుల నుంచి ఒత్తిడి వస్తుందని, అంత మాత్రాన రిజెక్ట్ చేసి పరిష్కరించినట్టు చూపడం ఎంతవరకు కరెక్టని ప్రశ్నించినట్టు తెలిసింది. వీటిపై పూర్తి వివరాలు తీసుకొని, తదుపరి చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్టు సమాచారం.



శుక్రవారం నాంపల్లిలోని ఇంటర్ విద్యా కమిషనరేట్‌ను ముట్టడించిన లెక్చరర్లు

# ఇంటర్ గెస్ట్ లెక్చరర్లను కొనసాగించండి

**రూ.42వేల వేతనాన్నివ్వండి • కమిషనరేట్‌ను ముట్టడించిన అధ్యాపకులు**

హైదరాబాద్, ఆగస్టు 16 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో గెస్ట్ లెక్చరర్లను ఈ విద్యాసంవత్సరం మొత్తం కొనసాగించాలని డిమాండ్ చేస్తూ లెక్చరర్లు శుక్రవారం నాంపల్లిలోని ఇంటర్ విద్యా కమిషనరేట్‌ను ముట్టడించారు. రూ.42వేల వేతనాన్ని అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఇంటర్ విద్యా జేఏసీ చైర్మన్ డాక్టర్ పీ మధుసూదన్‌రెడ్డి నేతృత్వంలో పలు జిల్లాల నుంచి భారీగా తరలివచ్చిన లెక్చరర్లు కమిషనరేట్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ఆగస్టు 15 దాటినా.. గెస్ట్ లెక్చరర్లను కొనసాగించకపోవడం అత్యంత దారుణమని వాపోయారు. 18 జూనియర్ కాలేజీలు కొత్తవి ఇవ్వగా, వాటిలో లెక్చరర్లు లేక చదువులు ముందుకు సాగడంలేదని ఆందోళన వ్యక్తంచేశారు. మ్యానిఫెస్టోలో పేర్కొన్నట్టు గెస్ట్ లెక్చరర్లకు నెలకు రూ.42వేల వేతనాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఎండీ భాషా, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, సదానంద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.